ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శుక్రవారం | నవంబరు 06, 2026 | సంపుటి : 7 | సంచిక : 131 | పేజీలు : 2



హైదరాబాదులో పద్మశాలీల భవనానికి

రూ.5 కోట్లు మంజూరు

- మంజూరు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- పద్మశాలి సంఘం నాయకులకు పత్రాలను అందజేసిన పొన్నం ప్రభాకర్, వి.హనుమంతరావు

హైదరాబాద్, ఆయుధం: హైదరాబాదులోని కోకాపేటలో పద్మశాలి సామాజిక వర్గానికి కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం కొరకు రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ గుండు సుధారాణి అన్నారు. తెలంగాణ రాష్ట్రం లోని వెనుకబడిన కులాల అభివృద్ధి సంక్షేమం లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని బీసీ వర్గాల అభ్యున్నతి కొరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వివిధ కుల సంఘాల భవన నిర్మాణాల కొరకు అక్టోబర్ 29న జీవో నెంబర్ 14ను విడుదల చేసిన సందర్భంలో హైదరాబాద్ లోని కోకాపేటలో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన స్థలంలో భవనాన్ని నిర్మించడానికి గాను రూ.5 కోట్లలను మంజూరు చేస్తూ దీనికి సంబంధించిన పత్రాలను గురువారం హైదరాబాదులో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు పద్మశాలి సంఘ నాయకులకు అందించారు.

ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ బీసీ వర్గాలకు అండగా ఉంటున్నారని అన్నారు. బీసీ కుల సంఘాల భవన నిర్మాణాల కొరకు అక్టోబర్ 29 న జీవో నెంబర్ 14 ను విడుదల చేసినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. అందులో భాగంగా మా పద్మశాలి సామాజిక వర్గానికి భవన నిర్మాణం కొరకు నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంజూరు పత్రాలను అందించిన బీసీ సంక్షేమ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు లకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి గద్దం జగన్నాథం, రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటుక రూప లతోపాటు పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు వరంగల్ ప్రజల చిరకాల ఆకాంక్ష

రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధి మరింత విస్తరించాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్
- మామునూరు విమానాశ్రయం పరిశీలన

వరంగల్, ఆయుధం: మామునూరు విమానాశ్రయాన్ని గురువారం జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ మామునూరు విమానాశ్రయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ... మామునూరు విమానాశ్రయం వరంగల్ ప్రజల చిరకాల ఆకాంక్ష అని అన్నారు. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో ఆరు విమానాశ్రయాలు ఉండగా తెలంగాణలో ప్రస్తుతం ఒకే విమానాశ్రయం ఉందని పేర్కొన్నారు. నిజాం కాలంలోనే వరంగల్‌లో విమానాశ్రయం నిర్మాణం జరిగిందని, అయితే కొన్ని కారణాల వల్ల అది ప్రస్తుతం వినియోగంలో లేకుండా పోయిందని అన్నారు. తిరిగి మామునూరు విమానాశ్రయం ప్రారంభం కానుండటం వరంగల్ ప్రజలకు సంతోషకరమైన విషయమని, ఈ ప్రాంత ప్రజల కల సాకారం కాబోతోందని పేర్కొన్నారు. తెలంగాణలో రోడ్లు, రైల్వేలు, ఆసుపత్రులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ప్రాంతీయ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల సాధారణ ప్రసవాలకు గాను ఆపరేషన్ కి ప్రాధాన్యత ఇచ్చేవాళ్ళు, ప్రస్తుతం మన ఆడబిడ్డల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రులలో నార్మల్ డెలివరీలను పూర్తిస్తున్నాం అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. మామునూరు ఎయిర్ పోర్ట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎయిర్ పోర్ట్ లో భూమి కోల్పోయిన వారిలో ఎస్సీ 55, ఎస్టీ1, బీసీ లు 214, ఓసి లు 60 మంది ఉన్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ఎస్సీ, ఎస్టీ లకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు ముందు ప్రాధాన్యత





ఇవ్వడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా అటవీ అధికారి నిఖిత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, డీఆర్‌వో విజయలక్ష్మి, వరంగల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారి నటరాజ్, ఆర్ అండ్ బి ఎస్ఈ సురేష్ బాబు, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ ఆనందం ఆర్డీవో సుమ, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన గుండు సుధారాణి దంపతులు

హైదరాబాద్, ఆయుధం: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను గురువారం హైదరాబాదులో కుడా చైర్ పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జీడబ్ల్యూఎంసి మాజీ మేయర్ గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు.





బీఎస్ఎఫ్ జవాన్ రాజేష్ సేవలు యువతకు స్ఫూర్తిదాయకం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

వరంగల్, ఆయుధం: దేశ సరిహద్దుల్లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ జవాన్‌గా 25 సంవత్సరాలుగా విశేష సేవలందిస్తూ, దేశ రక్షణలో కీలక పాత్ర పోషించిన కాశిబుగ్గ నివాసి వంగరి రాజేష్ ను గురువారం ఘనంగా సన్మానించారు. దేశ భద్రత కోసం తన జీవితంలోని పాతికేళ్లను అంకితం చేసిన రాజేష్ అద్వితీయ దేశభక్తిని, సేవలను గుర్తిస్తూ బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. వరంగల్ నగరంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ జవాన్ వంగరి రాజేష్ ను శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ, ప్రాణాలకు తెగించి దేశ సరిహద్దుల్లో పహారా కాస్తూ, మనందరికీ రక్షణ కల్పిస్తున్న సైనికులను గౌరవించడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని కొనియాడారు. రాజేష్ లాంటి జవాన్ల త్యాగాలు, నిరంతర సేవలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం సేవలందించి తిరిగొచ్చిన జవాన్‌ను గౌరవించుకోవడం తమ కమిటీకి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ధార్మిక జిల్లా కన్వీనర్ మడిపల్లి నాగరాజు గౌడ్, హనుమంతు శర్మ, డాక్టర్ కొంతం కృష్ణ, భారతీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శివరామకృష్ణ గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రోగొల్ల భరత్ వీర్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా

- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.వన్నాల వెంకటరమణ

హైదరాబాద్, ఆయుధం: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డా. రామ్ మాధవ్‌ను బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.వన్నాల వెంకటరమణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన హైదరాబాద్ విచ్చేసిన సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఎస్ఐఆర్ అంశంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన్నాల వెంకటరమణ డా. రామ్ మాధవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, సంస్థాగత కార్యకలాపాలు, రాజకీయ పరిణామాల గురించి డా. రామ్ మాధవ్ అడిగి తెలుసుకున్నారు. డా. వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ, తెలంగాణలో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి తన వంతు బాధ్యతగా నిరంతరం కృషి చేస్తున్నాని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు.



జాతీయ నాయకత్వం నుంచి లభిస్తున్న ప్రోత్సాహంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వరంగల్ జిల్లాలో, తెలంగాణలో బీజేపీ బలోపేతనికి కృషి చేస్తానని తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: వరంగల్ బస్ స్టేషన్, ఇన్నర్ రింగ్ రోడ్, భద్రకాళి మాడవీధుల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో వరంగల్ బస్ స్టేషన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, భద్రకాళి మాడవీధుల నిర్మాణ పనుల పురోగతిపై కుడా అధికారులతో పాటు సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో కుడా సిపివో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.





జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ను కలిసిన కమిషనర్

జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను గురువారం హన్మకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.


– వరంగల్, ఆయుధం:



10న మైసూర్ ఉత్తరాధిపతి

దత్త విజయానంద తీర్థ స్వామీజీ పర్యటన

వరంగల్, ఆయుధం: మైసూర్ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజి ఈ నెల 10న వరంగల్ నగరానికి విచ్చేస్తున్నట్లు శ్రీగణపతి సచ్చిదానంద దత్తజ్ఞాన బోధ సభ ట్రస్టు సభ్యులు వైవీ.వామన్ రావు తెలిపారు. కార్తీక మాసం దీపావళి సందర్భంగా ఈ నెల 10న మంగళవారం సాయంత్రం స్వామిజీ ములుగు రోడ్లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రానికి విచ్చేస్తారని, ఈ సందర్భంగా ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభిపృద్ధి హోమాన్ని అర్చకులు నిర్వహిస్తారు. అనంతరం స్వామిజీ వారిచే పూర్ణాహుతి జరుగుతుందని ఆయన తెలిపారు. ఆశ్రమంలో నిర్మాణంలో ఉన్న శ్రీగణపతి సచ్చిదానంద సభా మండపం నిర్మాణం పనులను పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా 11న బుధవారం ఉదయం 10గంటలకు లోక కల్యాణార్థం నగరంలోని శివనగర్ ప్రాంతంలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం లో సామూహికంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలను శ్రీదత్త విజయానంద తీర్థ స్వామిజీ పర్యవేక్షణలో జరుగుతాయని, ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామిజీ అనుగ్రహానికి పాత్రులు కాగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ కంటెం లక్ష్మినారాయణ, ప్రొఫెసర్ కె.కృష్ణప్రసాద్, చకిలం ఏకాంబరం తోట శివకుమార్, కేతిరెడ్డి విజేందర్‌రెడ్డి, బెండెల అర్జునావు, కొక్కుల రాజేంద్రప్రసాద్, నిమ్మల యుగంధర్‌రావు, జూలూరి శ్రీనివాసరావు, వడ్డె రవీందర్, వాడిచర్ల శ్రీనివాస్, మేడిశెట్టి కుమారస్వామి, కర్రు ఓంప్రకాష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పెంపునకు ప్రతిపాదనలు

- జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

హనుమకొండ, ఆయుధం: జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పెంపునకు ప్రతిపాదనలను ఎన్నికల సంఘానికి పంపించనున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లోజిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ, తదితర అంశాలపై ఈఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ, ఇప్పటి వరకు వచ్చిన వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఓటరుగా నమోదుకు పట్టభద్రులు చేసిన దరఖాస్తుల సంఖ్య, వాటి పరిశీలన, తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ..జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఇప్పటి వరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు కోసం 61041 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఇంకా దరఖాస్తులు రానున్నాయని తెలిపారు. ఓటర్ల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాలను పెంచే విధంగా ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలను పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఈఆర్వోలు/ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, హనుమకొండ ఏఈఆర్వో/తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావు అమరేందర్ రెడ్డి, ఎండీ. నేహాల్, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల గోదాంను తనిఖీ

చేసిన కలెక్టర్

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ సుబేదారి రెడ్ క్రాస్ సమీపంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు) భద్రపరిచిన గోదాంను నెలవారి తనిఖీలలో భాగంగా హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోదాంకు వేసి ఉన్న సీళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎం గోదాం వద్ద భద్రత, గోదాం పరిసరాల నిర్వహణ, సీసీటీవీ కెమెరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. అదే విధంగా ఈవీఎం గోదాం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని భద్రతా సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగుల పట్ల చూపించాల్సింది
జాలి కాదు ప్రేమ, చేయూత


హనుమకొండ, ఆయుధం: డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసు అథారిటీ హన్మకొండ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా కోర్టు ఆవరణలో మల్లికాంబ మనోవికాస కేంద్రం లోని మానసిక దివ్యాంగులు, బధిరులైన పిల్లలు చేసిన దీపావళి ప్రమిదల స్టాల్ ను హన్మకొండ జిల్లా జడ్జి ఎం.సునీత, వరంగల్ జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ, ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథులుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల చూపించాల్సింది జాలి కాదని, చేయూత, ప్రోత్సాహాన్ని అందించాలని, వారిలోను ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని ప్రేమగా ప్రోత్సాహాన్ని అందిస్తే వారి లోని ప్రతిభ వెలికితీయవచ్చని అన్నారు. దివ్యాంగత్వం శరీరానికే కాని ప్రతిభకు కాదన్నారు. దివ్యాంగుల సేవ దైవ సేవతో సమానం అన్నారు. దీపావళి సందర్భంగా అందరూ బయట ప్రమిదలు కొనే బదులుగా వీరు చేసినవి తీసుకుంటే వీరికి సహాయ సహకారాలు అందించిన వాళ్ళమవుతామని అన్నారు. జడ్జిలు, అడ్వకేట్స్ పిల్లలు తయారు చేసిన దీపాలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా జడ్జి సునిత, వరంగల్ జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ, ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి, హన్మకొండ డి.ఎల్.ఎస్.ఏ సెక్రటరీ పూజిత, వరంగల్ డి.ఎల్.ఎస్.ఏ సెక్రటరీ పూజ, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు రామలీల, కళ్యాణ్, జడ్జిలు, అడ్వకేట్స్ తదితరులు పాల్గొన్నారు.



అలుపెరుగని పోరాటయోధుడు
నల్ల నర్సింహులు

- వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యకులు చకిలం ఉపేందర్

వరంగల్, ఆయుధం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో టైగర్ నల్లా నర్సింహులు అలుపెరుగని పోరాట యోధుడని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చకిలం ఉపేందర్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం వరంగల్ హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ల అధ్యర్యంలో చకిలం ఉపేందర్ అధ్యక్షతన గురువారం జరిగిన తెలంగాణ టైగర్ నల్లా నర్సింహులు 33వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ తరం ప్రజలు వారి స్ఫూర్తిని పొంది ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ బార్ కౌన్సిల్ మెంబర్ దుస్సా జనార్దన్ మాట్లాడుతూ నల్లా నర్సింహులు నిరంకుశ విస్నూరు దొరను, భూస్వాముల ఆగడాలను ఎదిరించి ఎన్నో కేసులను ఎదుర్కొన్నారని, వారితో తనకు గల సహచర్యాన్ని అనుభవాలను పంచుకున్నారు. తొర్రూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీర వెంకట రత్నం మాట్లాడుతూ నల్లా నర్సింహులు జీవిత చరిత్ర చదివి ప్రేరణ పొందానని నల్ల నర్సింహులు తీవ్ర నిర్బంధంలో కూడా తను నమ్మిన ఆశయాలకోసం పోరాడారని, తెలంగాణ పేద రైతులకోసం ఉరికొయ్యలను కూడా ఎదిరించి పోరాడిన చరిత్ర వారిదని, యువతరం తెలంగాణ పోరాట యోధులను మరువరాదని అన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ నల్లా నరసింహులు భూమికోసం, భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తికోసం పోరాడారని, ఆయన పోరాట స్ఫూర్తిని పొంది బహుజనుల హక్కుల కోసం ఐక్య పోరాటం చేయాలని అన్నారు. వరంగల్ బార్ మాజీ అధ్యక్షులు వలస సుధీర్ మాట్లాడుతూ నల్ల నర్సింహులుకు అనాటి పాలకులు మూడుసార్లు ఉరిశిక్ష విధించబడినప్పటికీ ఆయన ధైర్యం కోల్పోలేదని, న్యాయస్థానాల్లో సైతం ధైర్యంగా తన వాదనలు వినిపించారని, ఆయన ధైర్యసాహసాలను చూసి పోలీసు అధికారులు సైతం ఆశ్చర్యపోయేవారని అంటూ ఆయన భార్య వజ్రమ్మ త్యాగం కూడా అనన్యమైనదని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మరుగునపడిన నల్ల నర్సింహులు చరిత్రను భావితరాలకు అందించాలని తన వయసును లెక్కచేయకుండా అవిరామంగా కృషి చేస్తున్న సామాజిక వేత్త పెద్దలు దాసరి జనార్ధన్ ను వరంగల్ బార్ అధ్యక్షులు చకిలం ఉపేందర్ శాలువతో సత్కరించారు. ఈ సమావేశంలో ఇరు బార్ అసోసియేషన్ల కార్యదర్శులు ఆర్ నాగేంద్ర చారి, ఊరుగొండ నరేందర్, ఉపాధ్యక్షురాలు వి లలితకుమారి, రఘుపతి, సంయుక్త కార్యదర్శి ఆడెపు సునిల్, సీనియర్ న్యాయవాదులు దాసరి ప్రేమ్ సాగర్, సాయిని నరేందర్, చిల్లా రాజేంద్ర ప్రసాద్, విలాసాగరం సురేందర్ గౌడ్, నీలా శ్రీధర్, సిద్ధు నాయక్, నర్సింగరావు, జన్ను పద్మ, నర్సింగ్, గంజి రమేష్, రాచకట్ల కృష్ణ, కుసుమ జగదీష్, పాము శరత్, నల్ల మహత్మ, గురిమిల్ల రాజు, కర్రు పావని, ఓరుగంటి కోటేశ్వర్ తదితర న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



నల్ల నరసింహులు వర్ధంతి

వరంగల్, ఆయుధం: నల్ల నరసింహులు 33వ వర్ధంతిని పురస్కరించుకొని కాశీబుగ్గ ఓ సిటీ రోడ్డు జంక్షన్ వద్ద "నల్ల నరసింహులు స్మారక సమితి" దాసరి జనార్దన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను, వీర పోరాటాలను పలువురు నాయకులు నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమం కాశీబుగ్గ జేవీసీ కన్వీనర్ డాక్టర్ కొణతం కృష్ణ అధ్యక్షత వహించారు. స్థానిక మాజీ కార్పొరేటర్ గుండెటి నరేందర్ మాట్లాడుతూ.. "నల్ల నరసింహులు త్యాగాలను గత ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. నేటి ప్రభుత్వమైనా తప్పనిసరిగా స్పందించి ఆయన జయంతి, వర్ధంతి ఉత్సవాలను ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహించాలి" అని డిమాండ్ చేశారు. కాశీబుగ్గ జేవీసీ కన్వీనర్ డాక్టర్ కొణతం కృష్ణ "ఉద్యమ సమయంలో నాటి ప్రభుత్వం నరసింహులు కు ఉరిశిక్ష విధించగా.. తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ కోర్టులో వాదించి, ఆయనకు విధించిన మరణశిక్షను రద్దు చేయించి ప్రాణాలను కాపాడారు." అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు గంగుల దయాకర్, టి. ఎన్. స్వామి, వరంగల్ రెడ్ క్రాస్ అధ్యక్షులు బేతి అశోక్, బీసీఐఎఫ్ కోఆర్డినేటర్ ధర్మపురి రాజగోవిందు, మడిపల్లి నారాజ్ గౌడ్ (బిజెపి ఎండోమెంట్ ధార్మిక సెల్ వరంగల్ జిల్లా కన్వీనర్) పెరుమల్ల లక్ష్మణ్, జంగం రాజనర్సు, అల్లి అజయ్, గుత్తికొండ రవి, గడ్డం సత్యనారాయణ, పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- ఘాట్లకు అనుసంధాన రహదారులు.. అవసరమైన భూసేకరణపై దృష్టి సారించాలి
- భక్తుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యమివ్వాలి
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు, ఆయుధం: గోదావరి పుష్కరాలు-2027 సందర్భంగా జిల్లాకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్లను సంసిద్ధం చేసేందుకు అవసరమైన మరమ్మతులు, నూతన పనుల ప్రతిపాదనల రూపకల్పనను వేగవంతం చేయాలని సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా లతో కలిసి గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టాల్సిన పనులు, మౌలిక సదుపాయాల కల్పన, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బైర్-1, బైర్-2, బైర్-3 ప్రాతిపదికన మంగపేట, చుంచుపల్లి, రామన్నగూడెం పుష్కర ఘాట్లను సంసిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా ఘాట్ల వద్ద ప్రస్తుతం ఉన్న సదుపాయాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, అదనపు నిర్మాణాలు, నూతన పనులను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కర ఘాట్ల వరకు భక్తులు సులభంగా చేరుకునేందుకు అనుసంధాన రహదారుల నిర్మాణం, అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. రహదారులకు అవసరమైన భూసేకరణ, భూముల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఘాట్ల వద్ద స్వచ్ఛమైన తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలకు దుస్తులు మార్చుకునే గదులు, విద్యుత్ దీపాలు తదితర సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, వ్యర్థాల సేకరణ, తరలింపునకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రవాణా, పార్కింగ్ ఏర్పాట్లపై సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. ఘాట్ల వద్ద వైద్య శిబిరాలు, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్స్‌లు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా వైద్యారోగ్య శాఖ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, తమ పరిధిలో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలను సకాలంలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను చాటిచెప్పేవనభోజనాలు

- 'పద్మశాలీల కార్తీకమాస వనభోజనాల మహోత్సవ' పోస్టర్ ఆవిష్కరణ..
- మార్కండేయుని ధర్మమార్గమే సమాజానికి ఆదర్శం.. ఈగ మల్లేశం



హనుమకొండ, ఆయుధం: తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పద్మశాలీల కార్తీక మాస వనభోజనాల మహోత్సవ ఉత్సవాల పోస్టర్ ను అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆవిష్కరించారు. హసన్ పర్తి లోని ప్రసిద్ధ పుణ్యక్షేతం ఎర్రగట్టు గుట్ట వద్ద ఈ ఉత్సవాలను నవంబర్ 29 ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న పద్మశాలి బంధువులు, మహిళలు, యువతీ యువకులు అందరూ కుటుంబ సమేతంగా తరలివచ్చి ఈ మహా సంబురాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. సమాజానికి మార్కండేయుని జీవితం ఆదర్శమని.. మానవాళికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తన అచంచలమైన శివభక్తి, పట్టుదల ఆత్మవిశ్వాసంతో మృత్యువునే జయించి, చిరంజీవిగా నిలిచిన ధీశాలి మార్కండేయుడని కొనియాడారు. ఆయన చూపిన భక్తి, ధర్మ మార్గంలో నడుస్తూ, కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు.
పద్మశాలి సమాజ ఐక్యతను చాటిచెప్పే ఆత్మీయ కలయికని, సామరస్యానికి ప్రతీక అని, పద్మశాలీల కార్తీక మాస వనభోజనాల మహోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు.. అది మన కుల బాంధవులందరి ఆత్మీయ కలయికని మన సంస్కృతికి సమాజ ఐక్యతను చాటిచెప్పేందుకు ఈ వేదిక మానవాళికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. మన ఆరాధ్య దైవం శ్రీ మార్కండేయ స్వామి ఆశీస్సులతో, మన సాంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు మన వారసత్వాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. మన పద్మశాలి ఆత్మగౌరవ సంబురంలో కుల బాంధవులందరూ భాగస్వాములు కావాలని కోరారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాలా నరేందర్, వైద్యం రాజగోపాల్, రాష్ట్ర కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, రాష్ట్ర కార్యదర్శి వెంగళ వేణుగోపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు బొప్ప శంకర్, గుర్రపు కోటేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కేదాసి వెంకటేశ్వర్లు, దిడ్డి రమేష్, పాము శ్రీనివాస్, గుర్రపు చంద్రశేఖర్, ధూంపేట నరేందర్, గజ్జెల అమరేందర్, దేవులపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

నల్ల నర్సింహులు పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



వరంగల్, ఆయుధం: చేనేత ముద్దుబిడ్డ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ నల్ల నరసింహులు పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములుఅన్నారు. వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద జిల్లా అధ్యక్షుడు చెలుకల రాజు ఆధ్వర్యంలో జరిగిన అమరజీవి నర్సింహులు 33వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వెంకట్రాములు ప్రసంగిస్తూ కడవెండిలో నిరుపేద చేనేత కార్మిక కుటుంబంలో జన్మించిన నర్సింహులు భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్య సాహసాలతో పోరాడిన విప్లవయోధుడని, నిజాం నిరంకుశ పాలనకు, ఎట్టి చాకిరికి, కుల వివక్షతలకు వ్యతిరేకంగా, భూస్వాముల జమీందారుల దోపిడి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా హైదరాబాద్ సంస్థానం విముక్తి కోసం అనాడు సాగిన సమరంలో నర్సింహులు నిర్వహించిన పాత్ర మరువలేనిదన్నారు. నిర్బంధాలు ఎన్ని ఎదురైనా, అరెస్టులై చిత్రహింసలకు గురై జైళ్ళ పాలైన నమ్మిన ఆశయాల కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహానుభావుడన్నారు. భూస్వాముల దేశ్ముఖ్ ల గుండెలలో సింహ స్వప్నంగా నిలిచాడని, దొరల గడీల పాలనను అంతం చేసేందుకు పట్టు వదలని విక్రమార్కుడిలా పోరాడాడన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు కావస్తున్న పాలకులు అనుసరిస్తున్న విధానాలతో నేటికి భూస్వామ్య పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ అంతం కాలేదని, దోపిడీ అనేక రెట్లు పెరిగిందని, నిరుద్యోగము అవినీతి అధిక ధరలు అంతులేకుండా పెరిగి సామాన్య ప్రజల బ్రతుకులు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. 90 శాతం గా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల వారికిరాజ్యాధికారం అందని ద్రాక్ష గానే మిగిలిందన్నారు. ఈ పరిస్థితులలో బడుగు బలహీన వర్గాల వారంతా చైతన్యంతో సంఘటితమై నర్సింహులు అందించిన పోరాట స్ఫూర్తితో సకల రంగాలలో మేమెంతో మాకంతా నినాదంతో పోరాటాలకు సిద్ధం కావాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, చెలుకల రాజు, ఏనుగు శైలజ, చిందం వెంకన్న, మిట్ట గడుపుల ఈశ్వర్, రాంబాయి, రజిత, నాగలక్ష్మి, భద్రమ్మ పాల్గొన్నారు.

విద్య రంగ సమస్యలను పట్టించుకోని పాలకులు

- ఎస్ఎఫ్ఐ 4వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్



హనుమకొండ, ఆయుధం: ఈ నెల 25, 26, 27 తేదీలలో హనుమకొండ నగరంలో జరిగే ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా 4, వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దేశంలో విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి ని నియమించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల హాస్టల్స్ లలో చదువుకునే విద్యార్థులకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో ఉంటూ తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. SMH కాలేజీ, హాస్టల్స్ కు కూడా సొంత భవనాలు లేవన్నారు. అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విద్య రంగ సమస్యలను పరిష్కరించడం లో వెనకడుగు వేస్తుంది అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,154 కోట్ల స్కాలర్ షిప్స్ ఫీజు రియంబర్స్ మెంట్ పెండింగ్లో ఉందన్నారు ఈ మహాసభల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా రంగ సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపుదిద్దుకొని విద్యా రంగ సమస్యలను పరిష్కరించేందుకు పోరాటాలు చేస్తూ ముందుకు వెళ్తామన్నారు. ఈ మాహసభల విజయవంతం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించి విజయవంతం చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ చెన్నూరి సాయికుమార్, మాసాని ప్రదీప్, సాల్మన్ రాజ్, నాగరాజ్, అనుపు భాను ప్రసాద్, మణిదీప్, రాజ్ కుమార్, నవీన్ సాయి, రణదీప్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడి చేసిన నిందితులను
కఠినంగా శిక్షించాలి

- డీసీఐవీ వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్ల కుమార్ మాదిగ

వరంగల్, ఆయుధం: రంగారెడ్డి జిల్లా అల్మస్ గూడ లో ఇద్దరు క్రైస్తవ మహిళాల పై దాడి చేసిన నిందుతులను ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా త్వరగా శిక్ష పడాలని డీసీఐవీ వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్ల కుమార్ డిమాండ్ చేశారు. వరంగల్ కాశీబుగ్గ అంబేద్కర్ సెంటర్ లో డి సి ఐ వి ఆధ్వర్యం లో నల్ల కండువాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఈర్ల కుమార్ మాదిగ మాట్లాడుతూ దేశం, సమాజం తల దించుకొనే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఇద్దరు మహిళను బూతులు తిడుతూ మనిషికాదు, మనవా మృగంలాగా విచక్షణ రహితంగా దాడిచేసిన ఆ సంఘటన చూస్తే ప్రతి పౌరుడు ఖండిం చాలనిపిస్తుంది అన్నారు. ఈ క్రైస్తవ మహిళపై జరిగిన దాడిపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరపాలని, దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ తూర్పు పాస్టర్ల అధ్యక్షులు నరమెట్ట ప్రేమ్ కుమార్, పాస్టర్ డేవిడ్ రాజ్, దళిత క్రైస్తవ ఐక్య వేదిక వరంగల్ తూర్పు కన్వీనర్ నగేష్, మండల ఇంచార్జి జన్ను యేసేప్ రాజ్, వరంగల్ మండల యూత్ ఇంచార్జి జన్ను ప్రశాంత్, నేతలు దౌడ్ విజయ్ రావు, పోలేపక సీతయ్య, డాక్టర్ క్రాంతి, సలెందర్, జన్ను అరవింద్, జన్ను పవన్, పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటరు నమోదు
పకడ్బందీగా చేపట్టాలి

- వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్

వరంగల్, ఆయుధం: వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియపై వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల, డివిజన్ స్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పిస్తూ, అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. పార్టీ శ్రేణులందరూ బాధ్యతగా వ్యవహరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు పొశాల వెంకన్న, ఇస్లావత్ సావిత్రి, దాడి శివ, ఇంద్ల రవికుమార్, డివిజన్ అధ్యక్షులు జన్ను అరుణాకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజ్ కుమార్, అశోక్, మహమ్మద్ జానీ, పసునూరి శ్రవణ్, కాంగ్రెస్ నాయకులు మన్నె బాబురావు, ఎల్గొండ ప్రవీణ్, గోదాసి చిన్న, కిన్నెర రవి, సన్నీ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



మానవసేవయే మాధవసేవ

- శామంతుల శ్రీనివాస్

వరంగల్, ఆయుధం: శివనగర్ భగవాన్ సత్యసాయి మండలి, ఆధ్వర్యంలో సత్య సాయి బాబా 101 వ జన్మదిన వేడుకలను వల్లంపట్ల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో, ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ శామంతుల శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేసి ప్రసాద వితరణ గావించారు. ఈ సందర్భంగా శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ, సేవ ప్రేమ దయ అనే సద్గుణాలతో మానవాళి సేవ చేయాలని భగవాన్ శ్రీ సత్య సాయి బాబా అన్న మాటలను గుర్తు చేశారు. మానవసేవయే మాధవసేవ అని అన్నారు. సత్యసాయి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో వల్లంపట్ల నాగేశ్వరరావు ప్రమీల కుటుంబం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు తోట సంపత్ కుమార్, వరలక్ష్మి, ఉషశ్రీ, రాధిక, విజయ తదితరులు పాల్గొన్నారు.



నరకాసుర వధ
ఉత్సవానికి రండి

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని రంగశాయిపేట 42వ డివిజన్ లో నవంబర్ 6వ తేదిన జరిగే నరకాసుర వధ కార్యక్రమానికి హాజరు కావాలని గురువారం కాకతీయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మండల నరసింహ రాములును నరకాసుర వధ ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మండల హరీష్‌కుమార్, కమిటీ సభ్యులు బక్కి వంశీ, బొల్లికొండ వినయ్, బజ్జూరి విష్ణు తదితరులు ఉన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695